క్లుప్తంగా

నేత్రపర్వం.. సువర్చలా హనుమద్ కల్యాణం



స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలను అందజేస్తున్న ఈవో

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. ధర్మ ప్రచారం కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లా కొత్తపేట కళాకారులు నిర్వహించిన కూచిపూడి, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగరావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీ



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ కొయ్యలగూడెం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గణేష్ సెంటర్లో క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శి గొలిశెట్టి వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి హాజరయ్యారు. రోటరీ క్లబ్ సేవల ద్వారా పంచాయతీ అభివృద్ధి చెందుతోందని, పోలవరం రోడ్డులోని కంకర కోనేరు అభివృద్ధికి సుమారు రూ.30 లక్షల విరాళం ప్రకటించిందని అన్నారు. చెరువుకి నలువైపులా వాకర్స్ ట్రాక్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్లబ్‌కి పంచాయతీ ప్రజల తరఫున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 150 మంది వృద్ధులకు, పేదలకు రగ్గులను అందజేశారు. రిటైర్డ్ ఈవో ఎస్‌కే అమిర్ భాష, తిర్నాతి సుబ్రహ్మణ్యం, మాటూరి రాధాకృష్ణ, బోనగిరి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కామవరపుకోట: పేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కుట్టు శిక్షణ ఉపయోగపడుతుందని కామవరపుకోట విచారణకర్త ఫాదర్ గోగు పీటర్ అన్నారు. ఏలూరు పీఠాధిపతులు, ఏపీఎస్ఎస్ఎస్ అధ్యక్షుడు జయరావు పొలిమేర సూచనల మేరకు స్థానిక ఎంఎస్ ఎంఐ.కాన్వెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత టైలరింగ్ శిక్షణను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఫాదర్ టీపీ ప్రసాద్, కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ మేరీ పాల్, ఫాదర్ ఏసుబాబు, సిస్టర్ అన్సెల్లా పాల్గొన్నారు.

అలరించిన 'రాగాలా - సరాగాలా'



ఘంటసాల పాటలు పాడుతున్న గాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101 జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన రాగాలా - సరాగాలా కార్యక్రమం ఘంటసాల అభిమానులను, సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల, తెలుగు రచయితల సంఘం, ఘంటసాల స్వరపీఠం సంయుక్త ఆధ్వర్యంలో «శతాబ్ది గాయకుణ్ణి స్మరించుకుందాం» పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు గాయకులు ఘంటసాల వివిధ చలనచిత్రాల్లో పాడిన విజయవంతమైన గీతాలను ఆలపించి వీనుల విందు చేశారు. ఈ సందర్భంగా గాయకులకు కీబోర్డుతో రవి, తబలాతో కళ్యాణ్, ప్యాడ్స్‌తో చిన్న వాద్య సహకారం అందించారు.

నేడు వేలేరులో 'పల్లెకు పోదాం'

కుక్కునూరు: మండలంలోని వేలేరు సచివాలయ పరిధిలో సోమవారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పల్లెకుపోదాం, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



బొర్రంపాలెం సచివాలయ భవనం ప్రారంభం అనంతరం మొక్కలు నాటుతున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

టి.నరసాపురం: రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ధీమా వ్యక్తం చేశారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు వారు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే ఆయన్ని తిరిగి అధికార పీఠం ఎక్కిస్తాయన్నారు. పారదర్శకపాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాలను ఇంటింటికి అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకోవడంతోపాటు రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించారన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. అందుబాటులో ప్రభుత్వ సేవలను ఉంచి ఇటు ప్రజలకు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అటు రైతులకు మేలు కలిగేలా సచివాలయాలు, ఆర్బీకేలు తీసుకువచ్చారని, ఇక ప్రజారోగ్యాన్ని దృష్టిలోకి ఉంచుకుని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులో ఉంచడం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరలా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుని ప్రజలకు మరింత మేలు చేసే విధంగా మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సచివాలయ కార్యాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, విలేజ్ క్లీనిక్‌ను వారు ప్రారంభించారు. మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాలలో పోలవరం మార్కెట్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపీపీ దారిపోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్‌బాబు, మొరవనేని అనిల్‌బాబు, సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ, ఒంటిపల్లి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొనకళ్ళ సర్వేశ్వరరావు, ఉప సర్పంచ్ కొనకళ్ళ సత్తిబాబు, తేజ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం



మద్దు గోపి దంపతులకు సత్కారం చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: కార్తీక మాసం మూడవ ఆదివారం పురస్కరించుకొని వనసమారాధనల కార్యక్రమాలు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. రేపల్లెవాడ మేధా పబ్లిక్ స్కూల్లో మండల ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, వృద్ధ దంపతులకు సత్కారంతో పాటుగా సమాజసేవలో పేరు తెచ్చుకున్న ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీల నాయకులకు సన్మాన కార్యక్రమం చేశారు. కొయ్యలగూడెం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి విశాలాక్షి దంపతులను సత్కరించారు. అనంతరం చిన్నారులకు మహిళలకు సాంస్కృతిక అంశాలపై పోటీలు, ఆటవిడుపు కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు బాలాలయంలోకి శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ప్రవేశం

కొయ్యలగూడెం: స్థానిక శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ పునర్నిర్మాణ నేపథ్యంలో అమ్మవారి పూజలకు ఆటంకం కలగకుండా బాలాలయ నిర్మాణం పూర్తి చేసినట్లు పాలకమండలి చైర్మన్ మంతెన సోమరాజు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నుంచి పూజలు ప్రారంభమై రాత్రి 8.01 గంటలకు అమ్మవారి మూలవిరాట్ విగ్రహం బాలాలయంలో ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు. నూతన ఆలయ నిర్మాణం పూర్తయ్యేవరకు అమ్మవారికి నిత్య పూజాది కైంకర్యాలు బాలాలయంలో నిర్వహిస్తామని అర్చకులు మామిళ్ళపల్లి సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. డిసెంబర్ 14వ తేదీ నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పూజలను బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానంద శర్మ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించడానికి సంకల్పించామని, భక్తులు విరాళాలు అందజేయాల్సిందిగా సూచించారు.

నమ్మించి మోసం.. నిందితుడిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒక యువతిని గర్భవతిని చేసి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మండలం బురాయిగూడెం గ్రామానికి చెందిన డీవీ పద్మ ఏలూరులో ఒక ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన మంద ప్రవీణ్‌కుమార్ 2020లో సదరు ఆసుపత్రికి వెళ్లడంతో పద్మతో పరిచయం ఏర్పడింది. అనంతరం వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడిచింది. తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తానని జంగారెడ్డిగూడెంలోని తన ఇంటికి తీసుకువచ్చిన ప్రవీణ్‌కుమార్ ఆమెను బలవంతంగా లోబరుచుకున్నాడు. ఇలా పలుమార్లు ఆమెను శారీరకంగా కలవడంతో ఇటీవల గర్భం దాల్చింది. దీంతో ప్రవీణ్‌కుమార్ ఆమెకు గర్భస్రావం అయ్యే విధంగా టాబ్లెట్‌లు ఇచ్చాడు. అయితే పెళ్లిచేసుకోమని ప్రవీణ్‌కుమార్‌ను నిలదీయడంతో అతను నిరాకరించాడని, తనకు న్యాయం చేయాలని పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జగన్ పాలనలో అర్హులకు సంక్షేమ లబ్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- వీరంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



వీరంపాలెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన వారికి నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ఆదివారం మండలంలో సాగిపాడు సచివాలయం పరిధిలోని వీరంపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో అనేకమంది నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి గ్రామ సచివాలయ వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో పింఛను తీసుకోవడానికి వృద్ధులు, వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కానీ ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థతో లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రతి నెలా 1వ తేదీన ఉదయమే పింఛను సొమ్ము అందుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు వలంటరీ వ్యవస్థను హేళన చేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ కనుమరుగవడం ఖాయమని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరలా వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గుండుగోలు సుబ్బారావు, ఉప సర్పంచ్ బలుసు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, సచివాలయాల కన్వీనర్లు షేక్ మీరా సాహెబ్, వెరీ శ్రీను, బొప్పన దుర్గయ్య, బేతిన రాఘవ, పులపాకుల ప్రసాద్, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించండి



మహాసభలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామారావు

చింతలపూడి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం సైదా క్రిస్టియన్ అమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మినీ అంగన్‌వాడీలకు పదోన్నతులు కల్పించి మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా గుర్తించాలని కోరారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఈనెల 8 నుండి అంగన్‌వాడీల సమ్మెకు అన్ని శాఖలు సహకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర్రావు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు తుర్లపాటి బాబు, కె బుచ్చిబాబు, గంధం అంజమ్మ, ఆర్ మరియమ్మ, సీపీఐ మండల కార్యదర్శి కె గురవయ్య, సహాయ కార్యదర్శి పి సోమశేఖరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం



జంగారెడ్డిగూడెంలో ఓ ఇంట్లో అగ్నిప్రమాదానికి దగ్ధమైన సామగ్రి

జంగారెడ్డిగూడెం: స్థానిక సాలిపేటలోని నౌడువారి వీధిలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి కొల్లి సూర్యారావు ఇంట్లో వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో వంట గదిలోని ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, టేబుళ్లు, గ్రైండర్, వంట సామాగ్రి, కప్‌బోర్డులు, ఏసీ, ఇంటి తలుపులు, విద్యుత్ వైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ అవుతున్న శబ్దానికి భయపడి కొల్లి సూర్యారావు దంపతులు బయటకు వచ్చేశారు. చుట్టుపక్కల వారు వచ్చి అగ్నిమాపక శాఖ కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి బి.అబ్రహ్మం, లీడింగ్ ఫైర్‌మన్ వెంకటరమణ తమ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నష్టం రూ.2.50 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఈఆర్‌వో కె.గీతాంజలి

జంగారెడ్డిగూడెం: ఓటర్లు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయాలని ఈఆర్‌వో (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) కె.గీతాంజలి సూచించారు. ఆదివారం పట్టణంలో, మండలంలో ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమానికి సంబంధించిన కేంద్రాలను ఆమె సందర్శించారు. పట్టణంలోని 44, 45, 55, 56, 57 కేంద్రాలు, వేగవరంలో 67, 68 కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గీతాంజలి మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం ఈ నెల 9 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చనిపోయిన ఓటర్లు, మైగ్రేషన్ అయిన ఓటర్లను గుర్తించి సక్రమంగా నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్లు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, డీటీ కె.రమేష్, మున్సిపల్ అధికారులు కేవీ రమణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చొప్పరామన్నగూడెంలో చెరుకు తోట దగ్ధం



దగ్ధమైన చెరుకు తోట

కొయ్యలగూడెం: చొప్పరామన్నగూడెంలో ఆదివారం సాయంత్రం చెరుకు తోట దగ్ధమైంది. గవరవరం గ్రామానికి చెందిన కౌలు రైతు చుక్కల అన్నవరానికి రెండు ఎకరాలలోని చెరకు తోటకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుపాను నేపథ్యంలో గాలులు వీయడం వల్ల చెరుకు తోట మీదుగా వెళ్లిన 11 కేవీ విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగలడంతో ప్రమాదం సంభవించిందని రైతు అన్నవరం పేర్కొన్నాడు. జంగారెడ్డిగూడెం నుంచి అగ్నిమాపక వాహనంతో ఫైర్ ఆఫీసర్ జి.అబ్రహం వచ్చి దగ్ధం అవుతున్న చెరకుతోటలోని మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో అగ్నిమాపక వాహనం రావడం వల్ల మిగిలిన చెరకు తోట ప్రమాదం నుంచి బయటపడిందని, రైతుకు సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి అబ్రహం పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

జంగారెడ్డిగూడెం: ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలు పట్టణంలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీహెచ్ బాలుర, బాలికల హైస్కూళ్లు, శ్రీచైతన్య స్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏటా 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 9, 10, 11, 12 తరగతులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను అందిస్తుంది. ఈ పరీక్షలకు 778 మంది విద్యార్థులకుగాను 730మంది హాజరయ్యారు. డీవైఈవో రామన్న దొర, ఎంఈవోలు బి.రాముడు, జి.రాములు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

తెలుగు మహాసభలకు తరలిరండి

ఆంధ్ర సారస్వత్ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ పిలుపు



ద్వారకాతిరుమల ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్ రాంపండుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గజల్ శ్రీనివాస్

ద్వారకాతిరుమల: తెలుగు మహాసభలకు తరలిరావాలని ఆంధ్ర సారస్వత్ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ట్రస్ట్ చైర్మన్ బొండాడ రాంపండును ఆదివారం గజల్ మర్యాద పూర్వకంగా కలిసి, తెలుగు మహాసభల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గజల్ మాట్లాడుతూ పట్టు కోల్పోతున్న తెలుగు భాషను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగా రాజమహేంద్రవరంలో జనవరి 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేలా చూడాలని రాంపండును కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఇన్‌చార్జి నల్లమెల్లి జగన్నాధరావు, రిటైర్డ్ తెలుగు లెక్చరర్ తడికమళ్ళ జగన్మోహిని, తెలుగు మహాసభ ఏలూరు జిల్లా ప్రతినిధులు వీరమల్ల మధు, పోరంకి నాగరాజు తదితరులున్నారు.

అధికారులపై అలిగి..!

శ్రీవారి దర్శనార్థం ఆదివారం ఆలయానికి విచ్చేసిన ఆంధ్ర సారస్వత్ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అక్కడున్న దేవస్థానం అధికారులపై అలిగారు. వివరాల్లోకి వెళితే. స్వామివారి దర్శనార్థం గజల్ శ్రీనివాస్ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆలయానికి విచ్చేశారు. ఆయనను ప్రొటోకాల్ ఏఈఓ పి.నటరాజారావు ఆలయ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే సాధారణ భక్తులతో పాటు, నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్న భక్తులతో ఆలయం రద్దీగా ఉంది. దాంతో స్వామివారి అంతరాలయ దర్శనానికి వెళ్లాలంటే కొద్ది సేపు వేచి ఉండాలని ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు గజల్‌కు సూచించారు. దీంతో అధికారులపై అలిగిన గజల్ రూ.200 ల క్యూలైన్ గుండా ఆలయంలోకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆ తరువాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆలయాల పరిరక్షణకు కృషి చేయాలి

కామవరపుకోట: స్థానిక వీరభద్ర స్వామి వారిని ఆదివారం సేవ్ టెంపుల్స్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను, శ్రీకృష్ణదేవరాయలు ఏర్పాటుచేసిన స్తంభాన్ని ఆయన పరిశీలించారు. అంతర్జాతీయ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయాల పునరుద్ధరణకు తన వంతు సాయం అందిస్తానన్నారు. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిధులు సమకూర్చటానికి తాను సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండూరు శ్రీధర్, ఆలయ చైర్మన్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు, వందనపు మురళి, తుమ్మలపల్లి వెంకటరమణ, అన్నదాన కమిటీ సభ్యులు కడిపి పాపారావు, బొల్లు సత్యనారాయణ, మారం రమేష్, వీరమల్ల మధు, రామకృష్ణ, భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందువులంతా ఐక్యం కావాలి



హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న అనగానంద స్వామిజీ

కుక్కునూరు: హిందువులంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని దత్తపీఠం గురూజీ అనగానంద స్వామిజీ పేర్కొన్నారు. ఆదివారం కుక్కునూరు రామసింగారం ప్రాథమిక పాఠశాలలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనగానంద స్వామిజీ మాట్లాడుతూ, హిందుత్వం అంటే జీవన విధానమన్నారు. హిందువులు ఆచరించే ప్రతి పనికి సైంటిఫిక్‌గా వివరణలున్నాయన్నారు. ప్రస్తుత కాలంలో హిందుత్వంపై దాడి ఎక్కువైందన్నారు. ఇటువంటి తరుణంలో హిందువులందరూ ఐక్యమై హిందుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సమరసతా సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ముప్పాళ్ల సాంబశివరావు మాట్లాతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో ఐదు దేవాలయాలు నిర్మించినట్టు చెప్పారు. అంతేకాక దివ్య దర్శనం పేరుతో ఎస్సీ, ఎస్టీలను ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శింపచేసినట్టు చెప్పారు. ఇక ముందు కూడా మరిన్ని ధార్మిక కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ భూపతి, గురుస్వాములు బట్టు వీరబాబు, ముప్పాళ్ల సత్యనారాయణ, మల్లయ్య, బొక్కా వెంకట్రావు, ధార్మిక సంస్థ సభ్యులు బొల్లు ప్రసాద్, మణికంఠ, నరసయ్య, ముక్తేశ్వరావు, తిరుపతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ తనిఖీ



ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణజ్యోతి

చింతలపూడి: ఓటర్ల నమోదులో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణజ్యోతి ఆదేశించారు. చింతలపూడి మండలంలోని రాఘవాపురం పోలింగ్ బూత్‌ను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. ఓటర్లు జాబితాలను పరిశీలించి తమ పేర్లు ఉన్నదీ, లేనిదీ సరిచూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా జాబితాల్లో మరణించిన వారి పేర్లు ఉంటే బీఎల్‌ఓల దృష్టికి తీసుకువచ్చి తొలగించుకోవాలని అన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ



చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం కొత్తపేటలో ఉన్న భవితా పాఠశాలలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. చిరంజీవి యువత గౌరవ అధ్యక్షుడు ఉక్కుర్తి సీతారాం రూ.20 వేలతో చిన్నారులకు భోజన ఏర్పాట్లు చేయగా, జవ్వాది ఉమా వెంకటేశ్ దుప్పట్లు, వేగవరం సరస్వతీ స్కూల్ యాజమాన్యం పండ్లు అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి బి.రాములు, వార్డు కౌన్సిలర్లు కరుటూరి రమాదేవి, వలవల తాతాజీ వీటిని చిన్నారులకు అందజేశారు. తొలుత కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవితా పాఠశాల ఉపాధ్యాయులు రజని, చైతన్య, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు నాగబాబు, స్కూల్ సిబ్బంది భవానీ, ఇందిర పాల్గొన్నారు.

రేపు సంస్కృత పాఠశాలలో కార్తీక వనసమారాధన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని శ్రీకాంచి కామకోటి పీఠ హేలాపురి సంస్కృత వేద స్మార్త ప్రయోగ పాఠశాలలో మంగళవారం కార్తీక సమారాధన నిర్వహించనున్నట్లు పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు ఈదర రమణప్రసాద్, తూములూరి విశ్వనాథ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్తీక సమారాధనలో భాగంగా ఉదయం వైదిక కార్యక్రమంగా సహస్ర లింగార్చన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి షోడశావరణార్చన, శ్రీరుద్రాభిషేకం జరుగుతుందన్నారు.